# తప్పేం వుంది ?

ఆస్తికోసం తల్లిదండ్రుల్ని నరికిచంపిన కసాయి కొడుకు " ఆరేళ్ళ బాలికపై ఉపాధ్యాయుడి లైంగికవేధింపులు ' , ' ప్రియురాల్ని గొంతుకోసిన ఉన్మాది ప్రియుడు ', ' పుట్టిన ఆడ శిశువుని విసిరిపారేసిన పాపిష్టి తల్లి' కాఫీ తాగుతూ అప్పుడే వచ్చిన పేపర్ని తిరగేస్తున్న ధనమ్మగారు దాన్ని పక్కనే పడేసింది. ఏమిటీ జనం ? వీళ్ళకి పిచ్చి పట్టిందా ? పోయేకాలం దాపురించిందా, తండ్రిలాంటి గురువు ఆరేళ్ళ పిల్లపైన – ఛ – అది చదివాక తను ఉపాధ్యాయురాలిగా ముప్ఫయి ఏళ్ళు పనిచేశానని చెప్పుకోటానికి సిగ్గుపడే పరిస్థితి దాపురించింది.

ఆవిడ అసలు పేరు వెంకట ధనలక్ష్మీ కుమారి. కానీ, అందరూ ధనమ్మగారూ అంటారు. స్కూల్లో కూడా ధనమ్మ టీచరు అని పిల్చేవారు. రిటైరై గూడా పదేళ్ళు దాటుతోంది. భర్త వాసుదేవరావు గతించి ఇరవై సంవత్సరాలవుతోంది. ఒక్కడే కుమారుడు. పేరు రవిచంద్ర. ఎంబిఎ పూర్తిచేసి ప్రస్తుతం న్యూయార్క్‌లో పెద్ద కంపెనీలో గొప్ప పోస్టులో వున్నాడు.

పేరు మహిమో ఏమో గాని ఆవిడకి మొదటినించి ధనపరమైన సమస్యలు పెద్దగా లేవనే చెప్పాలి. జాతక ప్రధానాలు...... అదృష్టాలకన్నా కష్టపడి పనిచేసే మనస్తత్వం, ముందు చూపు ముఖ్యం అని ఆవిడ గట్టిగా విశ్వసిస్తుంది.

ధనమ్మగారు చాలా అందగత్తెని అందరూ అంటుంటారు ఆ సంగతి ఆవిడకు కూడా తెల్సు, పచ్చటి పసిమి, గుండ్రని మొహం. అయిదు అడుగుల పైగా ఎత్తు. ఆవిడకి ఏ అవయవం ఎంతుంటే బాగుంటుందో సృష్టికర్త అంతే పెట్టాడని తూనికల్ని కొలతల్ని సరిగ్గా అనుసరించాడని పెద్ద మనుషులు పరోక్షంగాను, అంత పెద్ద మనుషులుగాని వారు ప్రత్యక్షంగాను చెప్పే సంగతి.

ధనమ్మ గడియారం వంక చూసింది.

ఉదయం తొమ్మిది ! పనిమనిషి వచ్చేసరికి స్నానం చేస్తే, ఆమొచ్చి ఇల్లుతుడిచి, అంట్లుతోమి విడిచిని బట్టలు ఉతికి ఆరేసిపోతుంది. వండి పెట్టడానికి కూడా ఒక ఆడమనిషిని పెట్టుకుంది. ఆవిడే కాంతమ్మ.

బతుకు, బతికించు అనే మాటమీద ఆవిడకి గట్టి నమ్మకం. అందువల్లే అవసరం లేకపోయినా పనికి వంటకి మనుషుల్ని పెట్టుకుంది. ఈ రోజుల్లో మరీ స్వార్థం పెరిగిపోయింది. పంచుకోవడం అనే మాటే లేదు. పాతరోజుల్లో అయితే అన్నం మిగిలిపోతే ' మాధాకవళం తల్లీ ' అనే అన్నార్తుకి పెట్టేవారం.

ఇపుడు ఫ్రిజ్జుల్లో పెట్టుకుని మర్నాడు మనమే భుజిస్తున్నాం. ఆవిడ ఆలోచనల్లకి బ్రేక్ వేస్తున్నట్లు ఫోను మోగింది. పనిమనిషి వీరమ్మ ఈ పూట రాలేదుట.

స్నానం పూర్తిచేసి ఉతికిన చీర కట్టుకుని చీపురుచ్చుకుని ఇల్లు శుభ్రం చేస్తుండగా, వంటావిడ శాంతమ్మ వచ్చింది. ' అదేంటి ధనమ్మగారూ, ఈరమ్మ రాలేదా ' అనడిగింది. ' పిల్లవాడికి జ్వరంట – ఫోన్ చేసింది '.

' అంతా వొట్టిదమ్మా. ఇవాళ ఇంజనీరు గారమ్మాయి పెళ్ళి. అక్కడ కూడా వీరమ్మే పనిచేస్తుంది. ఎక్కువ డబ్బులొస్తాయని అటెళ్ళుంటుంది.

మీరేవన్నా అంటారేమో అని పిల్లాడికి జ్వరం అని మాట అడ్డేసింది ' అంది వంటావిడ.

కష్టపడి సంపాదించటం, సంపాదించటానికి కష్టపడటం తప్పుకాదు. ఆవిడ కూడా స్కూలు అవర్స్ అయిపోయాక ట్యూషన్లు చెప్పేది. అలా నిర్విరామంగా కష్టపడింది కాబట్టే పిల్లవాడికి మంచి చదువు చెప్పించగలిగింది. ఎవరినీ అర్థించకుండా ఈ వయసులో గూడా గౌరవంగా జీవించగలుగుతోంది.

అంచేత పనిమనిషి చేసిన పని, తప్పని అనిపించలేదు గాని, అబద్ధం ఆడటం ఆవిడకి రుచించలేదు. పిల్లల్ని పెంచి పోషించి వృద్ధిలోకి తీసుకురావాలని పురుషుడి కన్నా స్త్రీనే ఎక్కువ పరితపిస్తుంది.

భర్తపోయేసరికి ధనమ్మ గారికి నలభై సంవత్సరాలు. రవికి ఆరేళ్ళు. అరోజు ఆ క్షణం నించి ఆవిడ లక్ష్యం, ధ్యేయం ఒక్కటే – కొడుక్కి మంచి చదువు చెప్పించి ప్రయోజకుడిని చెయ్యాలి. ' అయ్యో నాన్న బతికుంటే నా జీవితం బాగుండేదేమో ' అన్న మాటగాని, ఆలోచనగాని రాకుండా పెంచాలని కంకణం కట్టుకుంది.

లక్ష్యం నెరవేరింది. రవి అమెరికాలో లక్షలు సంపాదించుకుంటున్నాడు. " అయాం క్వయిట్ హేపీమమ్మీ " అంటుంటాడు ఫోన్లో. ఆవిడికి అదే ఆనందం. నా కొడుకే నా ఆస్తి అని గర్వంగా చెప్పుకుంటుంది.

ఒక లక్ష్యాన్ని ఆశించి, ఆ దిశగా ప్రయాణిస్తున్న సమయంలో మరే విషయం స్ఫురించదు. ఆ లక్ష్యాన్ని చేరుకున్నాక చుట్టూ చూసుకుంటే ఉదయించే ప్రశ్న ఇపుడు నేనేం చెయ్యాలి – అని.

ధనమ్మగారు కొడుకు పెంపకంలో మనిగిపోయి పగలూ రాత్రి అదే ధ్యాసలో, అదే ఆశలో బ్రతికి కొడుకు ప్రయోజకుడయ్యి డాలర్లవేటలో దేశంకాని దేశం వెళ్ళటంతో, ధనమ్మగారు  ఒంటరి అయిపోయి. ఇపుడు నేనేం చెయ్యాలి.  ఇపుడు నాకేం కావాలి అని ప్రశ్నించుకుంటే ఆవిడకొచ్చిన సమాధానం – ప్రేమ, అనునయం కావాలి. నా కోసం నువ్వు కష్టపడ్డావు. నీకు నేవున్నా అని అనాలని ఆవిడ ఆశిస్తుంది.

కానీ అప్పుడప్పుడు అనుమానం కూడా వస్తుంది. నే స్వార్థంగా ఆలోచిస్తున్నానా, చేసిన కష్టానికి ప్రతిఫలం ఆశిస్తున్నానా, నా ఆలోచనలు వ్యాపారధోరణిలో గాని వున్నాయా? ‘ ఇదిగో శాంతమ్మా నాకోమాట చెప్పు, నేగాని నువుగాని, ఆ వీరమ్మగాని లేక మరే తల్లిగాని పిల్లల గురించి కష్టపడి పెంచి, వాళ్ళు రెక్కలొచ్చాక ఎగిరిపోతే, నా బాధ్యత ముగిసిందని తృప్తిపడాలా, ఒంటరిగా మిగిలిపోయానే అని బాధపడాల్నా ?

ప్రశ్న విన్న వంటావిడ ఒక్క క్షణం విస్తుపోయింది. పాఠాలు చెప్పే పంతులమ్మ తనని ప్రశ్నించడం వింతగా అనిపించింది. అంటే ఆవిడలో ఏదో అశాంతి గూడుకట్టుకుని వుంది. ఆర్థికంగా  స్వతంత్రంగా బతగ్గలిగిన ధనమ్మగారికే అలా అనిపిస్తే కేవలం పిల్లలే ఆధారం అనుకునే నాలాంటి వారి పరిస్థితి ఏమిటి ?.

“ మనుషులకి ఒంటరితనాన్ని మించిన నరకం లేదమ్మా, వయసు మీరాక చేతిలో కర్రలా భుజంపైన ఒక ప్రేమహస్తం ఇచ్చినంత ఆనందం ఏ సంపద ఇవ్వలేదమ్మా ” ధనమ్మ ఆవిడ వంకరోగం గుట్టు పట్టుకున్న డాక్టరు వంక రోగి చూసినట్టు చూసింది.

ఆవిడ కళ్ళు చమర్చిన కారణంగా, “ ఎలా బతికానా అని కాదు ఎలా పోతానా అని నా భయం, భాధన్నూ....వయస్సులోనే భర్తని పోగొట్టుకున్నా. ఆయన పోయాక నాకెవరున్నారు అనుకుంటే నాకు నా కొడుకున్నాడు అని సమాధానం వచ్చింది. వాడి చెయ్యి పుచ్చుకుని ఇన్నేళ్ళుగా ఇంత దూరం వచ్చా. నా చెయ్యి పుచ్చుకుని నన్ను నడిపించాల్సిన వాడు నా మానాన నన్ను ఒదిలి దూరంగా వెళ్ళిపోయాడు. వెళ్ళి అయిదేళ్ళవుతోంది. ముక్తసరిగా  రెండ్రోజులకొకసారి మొక్కుబడిగా  మాట్లాడి ఫోను పెట్టేస్తాడు. మన భాష సాంప్రదాయం కాని పిల్లను పెళ్ళి చేసుకుంటానంటే నే కాదన్నానా ? నీ ఇష్టం నాన్నాఅన్నా” ఆశ్చర్యపోవటం వంటమనిషి వంతైంది.

“ అబ్బాయిగారి పెళ్ళి అయిపోయిందా. అంటే ఎవరు లేకుండానే ” ధనమ్మగారు పేలవంగా నవ్వింది.

“ రెండేళ్ళయ్యింది, బెంగాలీ పిల్ల. ఒకే ఆఫీసుట. గొప్ప కుటుంబమట. నువ్వు ఒంటరిగా రాలేవమ్మా. పెళ్ళి అయ్యాక మేమే వస్తాం అన్నాడు ” ఆవిడ కళ్ళు తుడుచుకుంది.

శాంతమ్మ ఆవిడకి ధైర్యం చెప్తున్న ధోరణిలో “ భాదపడకండమ్మా, కాలం మారిపోయింది, ఈ కాలం పిల్లలకి ఏదీ తప్పు కాదు. లక్షల్లో జీతాలు రావటంతో అన్నీ ఉన్నట్లు అనుకుంటున్నారు. విలువలకి, కట్టుబాట్లకి లోబడి బతికితేనే బతుకు రుచి తెలిసొచ్చేది. మీరేం భాధపడకండి. మీకు మేవంతా లేము ” అని వూరడించడంతో ధనమ్మ గారి మనసు కుదుటపడి కాఫీ తాగాలని వుంది అంది.

శాంతమ్మ వంటగదిలోకి వెళ్ళింది.

ఇది జరిగిన నెలరోజుల తర్వాత – ఒక రోజు శాంతమ్మ వచ్చేసరికి ధనమ్మ గారు హుషారుగా ఆనందంగా ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది. “ నెలాఖరుకి వస్తాట్ట. కేవలం నీగురించే వస్తున్నా అన్నాడు.

థాంక్యూ వుంటా ” ఫోన్ పెట్టి శాంతమ్మకి ఏదో చెప్పబోగా “ నాకు తెల్సమ్మా. అబ్బాయిగారు మీ గురించే వస్తున్నారు నెల రోజులు ఉంటారు అదేగా ” అంది.

“ అంతేనమ్మ అంతే –వాడున్న నెలరోజులు నువ్వు రానక్కర్లేదు, కంగారుపడక వచ్చి నీ జీతం డబ్బులు తీసుకెళ్ళు. మా వాడికి స్వయంగా నేనే వండిపెడతా ” ఆవిడ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

కాని – అతనొస్తున్నది తల్లిని చూడటానిక్కాదు. వాళ్ళ కంపెనీ కాన్ఫరెన్సులకని. భార్య పిల్లవాడిని బొంబాయినించి కలకత్తా ఫ్లయిటు ఎక్కించి పుట్టింటికి పంపి, తను హైద్రాబాద్ ఫ్లయిట్ ఎక్కాడు.

హైద్రాబాద్‌లో దిగగానే కంపెనీ వారి కారు సిద్ధంగా వుంది. గెస్టుహౌసుకి వెళ్ళిపోయి, తల్లికి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ధనమ్మగారి వుత్సాహం చప్పున చల్లారిపోయింది. కొడుకు కోడలు మనవడు కనీసం నెల రోజులైనా తనతో పాటు వుంటారని ఆశపడింది.

ఊళ్ళోకి వచ్చిన కొడుకు హొటల్లోనో, గెస్టుహౌసుల్లోనో వుండటం ఆవిడని తీవ్ర అసంతృప్తికి, మనస్తాపానికి గురిచేసినాయి. పనివారి ముందు పరువుపోయినట్టుగా బాధపడింది.

చూస్తుండగానే ఇరవై రోజులయిపోయినాయ్. మరో పదిరోజుల్లో కొడుకు తిరిగి అమెరికా వెళ్ళిపోతాడు.

మళ్ళీ ఎన్నేళ్ళకో రావటం. ఈ ఇరవై రోజుల్లో రెండే రెండు సార్లు వచ్చి గంట కబుర్లు చెప్పి భార్య, పిల్లవాడి ఫోటోలు చూపించి.. కొడుకు బర్త్‌డే ఫంక్షన్ని కంప్యూటర్లో చూపి. 'స వాడంతా నీ పోలికే " అన్నాడు.

ధనమ్మగారు పేలవంగా నవ్వి " నా అదృష్టంరాకుండా వుంటే చాలు " అంది. వచ్చే ఆదివారం రాత్రికి వచ్చి ఇక్కడే భోంచేసి ఉదయాన్నే వెడతానని హామీ ఇచ్చాడు.

ఆరోజే ఆదివారం – కొడుకుని తను కల్సుకుంటున్న ఆఖరి సందర్భం. ధనమ్మ గారిలో ఏదో వైరాగ్యభావం పెరిగిపోయింది. మానవ జీవితాల్లోని చీకటి కోణాలు ఆవిష్కరించబడినట్టయ్యింది. ఇపుడు ఆవిడలో బాధలేదు. దు:ఖం లేదు. నిర్లిప్తత, నిరాశల్లేవు. అసలు ఏ భావాలు లేని అదొక చిత్రమైన మనోస్థితి. ఏదో నిశ్చయానికివచ్చినట్టు నిర్లిప్తంగా పనులు చేసుకుంటోంది.

రాత్రి అయింది. చీకట్లు వ్యాపించాయి. రవిచంద్ర కంపెనీ మీటింగులో వున్నాడు. దాని తర్వాత తల్లికి వస్తానని ప్రామిస్ చేశాడు. ఇప్పటికే గంటలేటు, మొబైల్ ఫోన్లో ఆరు మిస్సుడు కాల్సు అమ్మవి.

మీటింగ్ జరుగుతుండగా వున్నట్టుండి అతడిలో ప్రవహిస్తున్న ధనమ్మ గారి రక్తం ఒక్కసారిగా పరుగులు తీయటం ప్రారంభించింది. అతనికి తల తిరుగుతున్నట్టు, కళ్ళు బైర్లు కమ్ముతున్నట్టు అనిపించి, టేబిల్ పైన తలవాల్చేసరికి కోలీగ్స్ కంగారుపడి డాక్టరు చేత పరీక్ష చేయించి హై బీపీ అన్చెప్పి మెడిసిన్స్ ఇచ్చి రెస్టు తీసుకోమని ఇంటికి పంపించారు.

అతను భారంగా ఇంటికి వచ్చేసరికి ధనమ్మగారు డైనింగ్ టేబిల్‌పైన మమకారం కొద్దీ చేసిన వంటలు, పిండివంటలు నీటుగా అమర్చివున్నాయి. ఒక పక్క వెండి కంచం బోర్లించి, ఆ పక్కనే చెంబుతో నీళ్ళు, మరో పక్కగా తల టేబిలుకు ఆనించి పడుకున్నది. " సారీ మమ్మీ అయామ్ లేట్ " అంటూ వచ్చి తల్లి భుజంపైన చెయ్యి వేశాడు. వులిక్కిపడ్డాడు. ఆవిడ శరీరం చల్లగా మంచుముద్దలాగా వుంది.

కంగారుగా ఆవిడ రెండు భుజాలపైన చేతుల వేసి వెనక్కి వాల్చేడు. నిర్జీవమైన ఆమె కళ్ళలోకి " అమ్మా " అని కొడుకు పిలవటంతో, ఏదో జీవంరాగా కళ్లు తెరిచి, కొడుకు చేతిని గుండెలపైన ఆన్చుకుని అతని చేతుల్లోనే వాలిపోయింది.

బల్లపైన ఖాళీగా పడున్న నిద్రమాత్రల సీసా, నోట్లోంచి వస్తున్న తెల్లటి నురగ – అతనికి అర్ధమైపోయింది అమ్మ ఇంకలేదు. తన చేతుల్లో మరణించటానికి ఆవిడ ఎంత మూల్యం చెల్లించిందో తెలిసొచ్చిన అతడు కంగారుగా ఏడుస్తూ కుప్ప కూలిపోయాడు. అంబులెన్స్‌లు, పోస్ట్‌మార్టంలు, డాలర్లు చేతులు మారటం వయసు రీత్యా సహజ మరణమని

రిపోర్ట్ మారిపోవటం చకచకా టకటకా జరిగిపోయాయి.

ధనమ్మగారి మరణవార్త చర్చలకి దారితీసింది ఎవరో పిల్చినట్లు అమెరికా నించి కొడుకు రావటం ఏమిటి అతని చేతుల్లో ఆవిడపోవటం – ఎంత అదృష్టం ఆవిడ మంచితనమే కారణం అని కొందరు, ........దైవేచ్ఛ పూర్వ పుణ్యఫలితం అని మరికొందరు.

ధనమ్మ గారి ప్రేమని, మంచిని మానవత్వాన్ని చూసిన వీరమ్మ, శాంతమ్మలయితే కడుపున పుట్టకపోయినా ఆవిడ కూతుళ్ళలాగా గుండెలు బాదుకుని ఏడ్చారు. ధనమ్మగారి గుర్తుగా ఆవిడ కట్టుకునే చీరల్ని అడిగి మరీ తీసుకున్నారు దాచుకోటానికని.

కొద్దిరోజుల తర్వాత అమెరికా తిరుగుప్రయాణంలో ఫ్లయిట్లో కూర్చుని రవిచంద్ర ఆలోచించాడు. తల్లి మరణానికి తను కారణమా అని. పాత భావాలకి చాదస్తాలకి అంకితమయిపోయి తొందరపడిపోయింది. ఇందులో నా తప్పేంవుంది అని సమాధానపడ్డాడు.

ఒంటరి బతుకు ఎడారిలో ప్రయాణం లాంటిది. అక్కడ నీళ్ళుండవ, కన్నీళ్ళు తప్ప. మనిషి వాసన వుండదు. కణకణకాలే ఇసుక కాళ్ళకింద, కనుల ముందర అనంతంగా పరుచుకుని వుంటుంది.

పిడచకట్టుకుపోతున్న మనసుని తడుపుకోవటానికి ఒక్క చుక్క ప్రేమజలం దొరకదు. ప్రాణానికి ప్రాణంగా కనిపెంచుకున్న సంతతి ఒయాసిస్సుల్లా ఆశని చావనివ్వరు. వృద్ధాశ్రమాల్లో చెట్లకింద, పుట్టలపక్కన కూర్చున్న అరిగిపోయిన గంధపు చెక్కల్లాంటి అమ్మలు నాన్నలు నిర్జీవచూపులే సాక్ష్యం. ఇప్పటికీ ధనమ్మగారు అదృష్టవంతురాలని ఆవిడది సహజమైన మరణమేనని అందరూ అనుకుంటూ వుంటారు.

**శంకమంచి పార్ధసారధి**

**----- అయ్యిపోయింది ---------**